

నేడు జిల్లా నీటిపారుదల సలహా మండలి సమావేశం

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశం ఈ నెల 15వ తేదీ ఉదయం 11 గంటలకు భీమవరం కలెక్టరేట్ కార్యాలయం మీ కోసం సమావేశ మందిరంలో జిల్లా నీటి పారుదల సలహా మండలి ఛైర్మన్, కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు జిల్లా జల వనరుల శాఖ అధికారి పి.నాగార్జునరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో గోదావరి పశ్చిమ డెల్టా రబీ పంట 2024 – 25 (ఫసలీ-1434)గాను నీటి లభ్యత, ఆయకట్టు గురించి చర్చించి పంట విస్తీర్ణం, రబీ పంట అనంతరం కాలువలు మూసివేసే తేదీ నిర్ణయించడం, ఖరీఫ్‌కు సంబంధించి కాలువలు తెరిచే తేదీ ఛైర్మన్ వారి అనుమతితో సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. జిల్లా నీటి పారుదల సలహా మండలి సభ్యులందరూ ఈ సమావేశానికి హాజరు కావాల్సిందిగా జిల్లా నీటిపారుదల శాఖ అధికారి పి.నాగార్జునరావు కోరారు.

చి'వరి'లో టెన్షన్..!

అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో మార్పులు

అన్నదాత గుండెల్లో గుబులు

రెండు జిల్లాల్లో దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో వరిసాగు

ముమ్మరంగా ఖరీఫ్ మాసూళ్లు

తడి, పాడి ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేయాలి : రైతులు

ప్రస్తుత ఖరీఫ్‌లో వరదలకు రెండు సార్లు 28 వేల ఎకరాల్లో పైగా పంట నష్టం

అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. శుక్ర, శనివారాల్లో వర్షం పడే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసింది. దీంతో అన్నదాత గుండెల్లో గుబులు నెలకొంది. పలు ప్రాంతాల్లో గురువారం చిన్నపాటి జల్లులు సైతం పడడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. పంట చివరి దశలో ఉండడంతో వర్షాలు పడితే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం నెలకొంది.



భీమడోలు మండలం పాతూరు వద్ద జాతీయ రహదారిపై ఆరబెట్టిన ధాన్యం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల వ్యాప్తంగా ఖరీఫ్‌లో దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగుచేశారు. వరదలు, తుపాన్లతో ఎన్నో వ్యయప్రయాశలకు ఓర్చి పంటను కాపాడుకుంటూ వచ్చారు. పంట చివరిదశకు చేరింది. ఖరీఫ్ మాసూళ్లు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకూ పశ్చిమగోదావరి జిల్లాలో 20 వేల ఎకరాల్లో మాసూళ్ల పూర్తికాగా ఏలూరు జిల్లాలో 20 శాతం వరకూ మాసూళ్లు జరిగినట్లు తెలుస్తోంది. ఏలూరు జిల్లాలో ఉంగుటూరు, భీమడోలుతోపాటు పలు మండలాల్లో రైతులు కోతలు ముమ్మరంగా సాగుతుండగా, పశ్చిమలో తాడేపల్లిగూడెం, పెంటపాడు, తణుకు వంటి పలు మండలాల్లో మాసూళ్లు కొనసాగుతున్నాయి. యంత్రాలతో వరి కోతలు కోయడంతో రైతులు ధాన్యం ఆరబెట్టాల్సి వస్తోంది. మిషన్లతో మాసూళ్లు చేయడంతో ధాన్యంలో తేమశాతం 20 శాతానికి పైగా ఉంటుంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలంటే తేమ 17 శాతం దాటకూడదు. దీంతో రైతులు ధాన్యం అరబెట్టి విక్రయించాల్సి వస్తోంది. జాతీయ రహదారులపై, పుంతరోడ్లపై రైతులు ధాన్యం అరబెట్టిన పరిస్థితి. ఈ తరుణంలో వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో రైతులు పరుగులు తీస్తున్నారు. వాతావరణ మార్పులతో ఎండ తక్కువగా ఉండడంతో ధాన్యం త్వరగా ఆరని పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులు తీవ్రంగా నలిగిలిపోతున్నారు. ధాన్యం ఆరబెట్టేందుకు కళ్లాలు లేకపోవడం, సరిపడా బరకాలు లేకపోవడంతో తడి, పొడి ధాన్యం విక్రయించేందుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. దీంతో వ్యాపారులు రైతును అయినకాడికి దోచుకునేందుకు సిద్ధమయ్యారు. 75 కిలోల బస్తా ధాన్యం రూ.1,725 వరకూ ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించగా దళారులు తడి, పొడి ధాన్యం పేరుతో బస్తాకు రూ.1,350 నుంచి రూ.1,400 మాత్రమే చెల్లిస్తున్నారు. దీంతో రైతులు బస్తాకు రూ.300లకుపైగా నష్టపోతున్న పరిస్థితి. తడిపొడి ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో రైతులు ఏటా పెద్ద ఎత్తున నష్టాలు చవిచూస్తున్నారు. ధాన్యం కొనుగోలులో సైతం ప్రభుత్వం రైతులకు అనుకూలంగా మార్పులు చేయాలని కోరుతున్నారు.

ప్రస్తుత ఖరీఫ్‌లో రెండు సార్లు పంట నష్టం

ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభం నుంచి రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. ఈ ఏడాది జులై, సెప్టెంబర్‌లో రెండు సార్లు విరుచుకుపడిన వర్షాలు, వరదలకు రెండు జిల్లాల్లోనూ దాదాపు రూ.27 కోట్ల మేర పంట నష్టం జరిగింది. జులైలో విరుచుకుపడిన వరదలకు పశ్చిమలో 12,597 ఎకరాల్లో పంట నష్టం జరగ్గా రైతులకు రూ.పది కోట్ల మేర నష్టపరిహారం అందించాలని అధికారుల నివేదించారు. ఏలూరు జిల్లాలో 350 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, రైతులకు రూ.కోటి వరకూ నష్టం పరిహారం అందించాలని అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. సెప్టెంబర్‌లో విరుచుకుపడిన భారీ వర్షాలు, వరదలకు ఏలూరు జిల్లాలో 7,484 ఎకరాలు పంటనష్టం వాటిల్లగా రూ.7.48 కోట్ల నష్టపరిహారం, పశ్చిమలో 8,546 ఎకరాల్లో పంట నష్టం జరగ్గా రూ.8.55 కోట్లు నష్టపరిహారం మొత్తం రూ.16 కోట్లు అందించాలని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. సెప్టెంబర్‌లో జరిగిన నష్టపరిహారం రైతులకు ప్రభుత్వం అందించింది. జులైలో జరిగిన నష్టపరిహారం మాత్రం రైతులకు ఇంకా అందలేదు. 33 శాతంపైగా నష్టపోయిన పొలాలను మాత్రమే పరిగణలోకి తీసుకున్నారు. 33 శాతంలోపు నష్టపోయిన పంటపొలాలు వేలాది ఎకరాలు ఉన్నాయి. వరదలకు దెబ్బతినగా మిగిలిన పంటను కాపాడుకోవడానికి రైతులు నానా కష్టాలు పడ్డారు. ఈ తరుణంలో వర్షాలు పడితే జిల్లా రైతాంగానికి కోలుకోలేని దెబ్బతగలనుంది. ధాన్యం కొనుగోలు వేగంగా జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

బాలలు ఉన్నత స్థాయికి ఎదగాలి

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

బాలలు లక్ష్యాన్ని నిర్దేశించుకుని విద్యతో ఉన్నత స్థానాలను అధిరోహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. గురువారం ఎఆర్‌కెఆర్ మున్సిపల్ హైస్కూల్ వద్ద జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తులో సమాజాన్ని నడిపించే దార్శినికులు నేటి బాలలే అన్నారు. పిల్లలు అనవసర విషయాలపై దృష్టి పెట్టకుండా లక్ష్యాన్ని నిర్దేశించుకుని జీవితంలో మంచి స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. పిల్లలు సెల్‌ఫోన్లు, సినిమాలు, సోషల్ మీడియా, మత్తు పదార్థాలు తదితర దుర అలవాట్లకు దూరంగా ఉంటూ సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. బాలలకు కొన్ని ప్రత్యేక హక్కులు రాజ్యాంగం ద్వారా సంక్రమించాయని, వాటిపై అవగాహన కలిగి సమాజంలో ముందుకు నడవాలని అన్నారు. బాలికలు చదువుపై దృష్టి సారించి ఆర్థిక స్వాతంత్రం వచ్చేవరకూ వివాహం, కుటుంబ వ్యవస్థల వైపు దారి మళ్లకూడదన్నారు. డిఇఒ ఇ.నారాయణ, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి బి.సుజాతారాణి మాట్లాడారు. పిల్లలకు విద్య నేర్చుకోవడానికి ఉన్న అవకాశాలు, బాలల హక్కులు, బాల్య వివాహాలను నిరోధించడం, సత్ప్రవర్తన కలిగి విద్యలో రాణించడం, తదితర విషయాలపై పిల్లలకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లను కల్టెర్ అందజేశారు. ఈ అనంతరం బాలల హక్కులపై రూపొందించిన గోడ పత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆర్.రాజేష్, ఎంఇఒ ఎన్.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు ఎవి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్వాడీ చిన్నారులతో కలెక్టర్ ముచ్చట్లు

అంగన్‌వాడీ చిన్నారులను సొంత బిడ్డల్లా చూసుకుని విద్యాబుద్ధులు నేర్పించాలని కలెక్టర్ తెలిపారు. గునుపూడి ఇందిరా గాంధీ పురపాలక సంఘం ప్రత్యేక ప్రాథమిక పాఠశాలలో గుల్లంక వారి వీధి, వసంతాల వారి వీధి, గురువు పేటకు చెందిన అంగన్వాడీ సెంటర్‌ను బాలల దినోత్సవం సందర్భంగా కలెక్టర్ సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. ప్రభుత్వ మెనూ ప్రకారం చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐసిడిఎస్ అధికారి బి.సుజాతారాణి, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆర్.రాజేష్, సిడిపిఒ టికెవి.లక్ష్మీకాంతం, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

నివాసాల మధ్య మద్యం షాపు వద్దు

గొల్లలకోడేరు హరిజనపేట వాసుల నిరసన



ప్రజాశక్తి - పాలకోడేరు

నివాసాల మధ్య మద్యం షాపు వద్దు అంటూ గొల్లలకోడేరు హరిజనపేట వాసులు డిమాండ్ చేశారు. స్థానిక హరిజనపేట సమీపంలో జిల్లా నివాసాల మధ్య ఏర్పాటు చేస్తున్న మద్యం షాపు వద్ద గురువారం హరిజనపేట వాసులు నిరసన తెలిపి విలేకరులతో మాట్లాడారు. తాడేపల్లిగూడెం నుంచి భీమవరం వెళ్లే ఆర్అండ్‌బి రోడ్డు, పాలకోడేరు నుంచి భీమవరం వెళ్లే ఆర్అండ్‌బి రోడ్డుకు ఆనుకొని మద్యం షాపు ఏర్పాటు చేస్తున్నారన్నారు. దీనికి దగ్గర్లో బివి.రాజు కళాశాలతో పాటు అనేక పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయని తెలిపారు. ఈ రహదారి గుండా విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు ప్రయాణం చేస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో వారికి ఇబ్బందులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయన్నారు. కొన్ని అనుకోని విధంగా ఏమైనా ఘటనలు జరిగితే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. అలాగే మద్యం షాపు ఏర్పాటు వద్ద పంచాయతీకి సంబంధించిన చెరువు కూడా ఉందని, కూత వేటు దూరంలో దేవాలయం ఉందని తెలిపారు. దేవాలయానికి వచ్చే మహిళలు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. మద్యం షాపు ఏర్పాటును అడ్డుకొని పాలకోడేరు, గొల్లలకోడేరు పంచాయతీ కార్యదర్శులు ఫిర్యాదులు చేస్తామన్నారు. స్థానికంగా నిర్మిస్తున్న మద్యం షాపులు వేరే చోటకు తరలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హరిజనపేట ప్రాంత ప్రజలు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

సిపిఎం ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు



గణపవరం : తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - గణపవరం

కేంద్రంలో మోడీ రైతు, వ్యవసాయ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడకపోతే తగిన మూల్యం చెల్లించక తప్పదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబురావు హెచ్చరించారు. ప్రజాపోరు ప్రచార కార్యక్రమంలో భాగంగా సిపిఎం నాయకులు ఈనెల 8 నుంచి 13వ తేదీ వరకు గ్రామాల్లో ప్రచారం చేసి గురువారం స్థానిక తహశీల్దార్ వై.అప్పారావుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ మోడీ జమిలి ఎన్నికలు అన్న, విద్యుత్ భారాలు వేస్తున్నా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మౌనం వహిస్తుందన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించటంలో, వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో నిధులు కేటాయింపులో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. జిల్లా నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, మండల కార్యదర్శి పి.నరశింమూర్తి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికులకు ఎంతగానో ఉపాధి కల్పిస్తున్న ఉపాధి హామీకి బడ్జెట్లో నిధులు రోజు రోజుకి తగ్గిస్తున్నారన్నారు. కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని



తాడేపల్లిగూడెంలో..

డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మేడిశెట్టి పెంటారావు, చిన్నం చిననాగేశ్వరరావు, సోడదాసి సంజీవిరావు పాల్గొన్నారు.

పెనుమంత్ర : అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం ప్రజలపై మోపుతున్న భారాలు మానుకోవాలని, వెంటనే ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని సిపిఎం నాయకులు బళ్ల చినవీరభద్రరావు, మండల కార్యదర్శి కూసం పూడి సుబ్బరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, తహశీల్దార్ వై.రవికుమార్‌కి వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వీరభద్రరావు, సుబ్బరాజులు మాట్లాడుతూ ప్రజలకు భారంగా మారిన నిత్యావసర ధరలు అరికట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోడి శ్రీనివాసప్రసాద్, నేతల నాగేశ్వరరావు, పిల్లి రాజారావు, కుడిపూడి నాగేశ్వరరావు, ఇందుకూరి వెంకటరాజు, గంటి ఆంజనేయులు, చిన వెంకటేశులు, ఏడుకొండలు, పరమేశ్వరరావు పాల్గొన్నారు.

పెనుగొండ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలో నిరుద్యోగం, నిత్యావసర వస్తువుల ధరలు, మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాల సమస్యలు గాలికొదిలేసి ప్రజా వ్యతిరేక జమిలి ఎన్నికల నిర్వహణ, ప్రజలకు ఉపయోగం లేని అంశాలను ముందుకు తీసుకురావడం దారుణమని సిపిఎం మండల కార్యదర్శి షేక్ పాదుషా అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ బి.అనిత కుమారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా షేక్ పాదుషా మాట్లాడుతూ రైతులు, ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ నాగిశెట్టి గంగారావు, కప్పల రత్నరాజు, నీలాపు ఆదినారాయణ, పులిదిండి రామారావు, మాదాసు నాగేశ్వరరావు, దొంగగూడెం, కోడిపందాల దిబ్బ ప్రాంతాల నుంచి పూతినీడి పద్మ, జక్కంశెట్టి సాయమ్మ, పెచ్చెట్టి దుర్గ, జక్కంశెట్టి లీల, రామేశ్వరపు రత్నకుమారి పాల్గొన్నారు.

యలమంచిలి : కూటమి ప్రభుత్వం వస్తే తమకు మేలు జరుగుతుందని ఆశించిన ప్రజలకు తీవ్ర నిరాశ ఎదురవుతుందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు భాతిరెడ్డి జార్జి అన్నారు. సిపిఎం తలపెట్టిన ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జార్జి మాట్లాడుతూ ఒకపక్క నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయని, మరోపక్క ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ ట్రూ ఆఫ్ చార్జీలు పెంచడం ద్వారా మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా ఉందన్నారు. అనంతరం తహశీల్దార్ గ్రంధి పవన్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కానేటి బాలరాజు, నాయకులు గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, ఎడ్ల మోహనరావు, బాతిరెడ్డి సుగుణ, పల్లేరు వెంకటస్వామి, కేత శ్రీనివాస్, ఆకుమర్తి జోసెఫ్, గోగినేని పణీంద్ర పాల్గొన్నారు.

పాలకొల్లు : ఉచిత ఇసుక పాలసీ అమలు చేసి, కార్మికులకు ఉపాధి కల్పించాలని మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డిప్యూటీ తహశీల్దార్ రవికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. ఎన్నికల ముందు కరెంటు ఛార్జీలు పెంచమని చెప్పారని, ఇప్పుడు ట్రూఅప్ ఛార్జీల పేరుతో వేల కోట్ల రూపాయల భారం ప్రజలపై వేయడానికి సిద్ధ పడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, లేకుంటే పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని రాజగోపాల్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, టి.గంగరాజు, చల్లా సోమేశ్వరరావు, వై.అజయ్, టి.శ్రీనివాసరావు, వెంకన్న, నగేష్, శ్రీనివాసురెడ్డి, యాకల రాము పాల్గొన్నారు.

ఆచంట : అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు, జమిలి ఎన్నికలు, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ప్రజాపోరు పేరుతో గురువారం ఆచంట తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ జి.కనకరాజుకు వినతి పత్రం అందజేశారు. పెంచిన ట్రూఅప్ ఛార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్, సిపిఎం నేతలు సిర్రా నరసింహమూర్తి, బండి రంగారావు, తలుపురీరి బుల్లబ్బాయి, తోటపల్లి సత్యనారాయణ, గుత్తుల రంగారావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ ఖతీబ్ కౌసర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. సిపిఎం కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ప్రజాపోరు పేరుతో ఈనెల 8వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఇంటింటికీ తిరుగుతూ ప్రజా సమస్యలపై ప్రచారం నిర్వహించినట్లు సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సభ్యులు చింతకాయల బాబురావు, కర్రి నాగేశ్వరరావు, సిరపరపు రంగారావులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రూ అప్ ఛార్జీల పేరుతో ప్రజలపై కరెంట్ ఛార్జీలు భారం వేస్తున్నారని అన్నారు. ప్రజలపై అదనపు భారం పడే స్మార్ట్ మీటర్ల రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు జవ్వాది శ్రీను, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, శేషు, పోతు శ్రీను పాల్గొన్నారు.

ఆకివీడు : రైతులు, సామాన్య ప్రజానీకం పాలిట ఉరితాడుగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలని సిపిఎం పట్టణ కమిటీ నాయకులు పెంకి అప్పారావు, నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆ పార్టీ చేపట్టిన తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా కార్యక్రమంలో



తణుకులో..

భాగంగా శుక్రవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ నడు వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సందక సూరిబాబు, గేదెల ధనుష్, చలపతి శీను, ముద్దే వెంకన్న, భవాని, తులసి, బొచ్చారమణ పాల్గొన్నారు.

తణుకు : మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం పట్టణ కార్యదర్శి పివి ప్రతాప్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ డివిఎస్ఎస్.అశోక్‌వర్మకి వినతిపత్రాన్ని అందజేశారు. అధిక ధరలు తగ్గించాలని, నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని, దళితులు, మహిళలు, విద్యార్థినులపై జరుగుతున్న దాడులను, హత్యలను, అత్యాచారాలను ఆపాలని, విశాఖ ఉక్కు, ప్రభుత్వ రంగ ప్రయివేటీకరణ ఆపాలని, ఉచిత ఇసుక విధానం అమలు చేయాలని, జయంతి కాలనీలో ఉన్న యానాదులకు ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం చేసి ఇవ్వాలని, పట్టణంలో కుక్కలు, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని, పట్టణాల్లో ఉపాధి హామీ చట్టం అమలుచేయాలని పెద్ద



పాలకొల్లులో..

ఎత్తున నినాదాలు చేశారు. సిపిఎం సీనియర్ నాయకులు గార రంగారావు, నాగరత్నం, గుబ్బల గోపి, సింగులూరి సత్యనారాయణ, ఎ.కొండయ్య, పి.జయరాజు, నాగమణి, చంద్రమ్మ, వరలక్ష్మీ, పసుపులేటి దుర్గ, సురేంద్ర పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిపిఎం మండల కన్వీనర్ కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజాపోరులో భాగంగా సిపిఎం ఆధ్వర్యంలో ఇరగవరం మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, అనంతరం అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. సిపిఎం సభ్యులు ఇల్లిందరపర్తి సత్యనారాయణ, గుత్తుల రామాంజనేయులు, పాలా సత్యనారాయణ పాల్గొన్నారు.

మొగల్తూరు : పెరిగిన అధిక ధరలతో ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం మండల కార్యదర్శి ఒడుగు శ్రీనివాస్ అన్నారు. మొగల్తూరులోని తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం సాయంత్రం సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ధరలు తగ్గించాలని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు ఆపాలని, విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణ చేయకూడదని, జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి నష్టదాయకమని ఆయన అన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ కె.రాజకిషోర్‌కు అందించారు. ఆయా కార్యక్రమంలో యడ్ల చిట్టిబాబు, ఆదూరి సామమూర్తి, వీరా పాండురంగారావు, కొల్లాటి బాబురావు, చిలకలపూడి నాగేశ్వరరావు, అడ్డాల ఏడుకొండలు ఉన్నారు.



ఆచంటలో..

ఉద్యమాల్లో బ్రహ్మాజీరావుది చురుకైన పాత్ర

సంస్మరణ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం



మాట్లాడుతున్న మంతెన సీతారాం

ప్రజాశక్తి - నరసాపురం

ప్రజల కోసం తమ జీవితాలను త్యాగం చేసిన వారు ప్రజల హృదయాల్లో స్థిరస్థాయిగా నిలిచిపోతారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. పట్టణంలోని 9వ వార్డులో సిపిఎం సీనియర్ నాయకుడు కానూరు బ్రహ్మాజీరావు సంస్మరణ సభ సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు అధ్యక్షతన నిర్వహించారు. తొలుత కానూరు బ్రహ్మాజీరావు చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. అనంతరం సభకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంతెన సీతారాం మాట్లాడుతూ బ్రహ్మాజీరావు మధ్య తరగతి కుటుంబంలో పుట్టి కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతం పట్ల ఆకర్షితులై నరసాపురం డివిజన్ స్థాయిలో భూస్వామ్య పెత్తందారి వ్యవస్థకు వ్యతిరేక పేదల కోసం జరిగిన ఉద్యమాలలో చురుకైన పాత్ర పోషించారన్నారు. పట్టణంలో కార్మిక వర్గాల సమస్యలు, వారి హక్కుల కోసం నిరంతరం శ్రమించారన్నారు. ఈ ప్రాంతంలో రైస్‌మిల్, బజార్ జట్లు, రిక్షా కార్మికులు, వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం, సమస్యల పరిష్కారానికి అనేక ఉద్యమాలు బ్రహ్మాజీ నాయకత్వంలో జరిగాయన్నారు. కమ్యూనిస్టు పార్టీ తొలితరం నాయకులు మాజీ ఎంపీ రామం, ఆర్ఎస్ వంటి మహా నాయకుల అడుగుజాడల్లో క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా ఆయన సిపిఎంకు సేవలందించారన్నారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, సిపిఐ సీనియర్ నాయకులు నెక్కంటి సుబ్బారావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు పొగాకు పూర్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు నోములకొండ అప్పలనాయుడు, బుడితి ఇజ్రాయిల్, గుత్తుల శ్రీరామ్, చంద్రుడు, కోడి లక్ష్మణ్ పాల్గొన్నారు.

రఘు రామకృష్ణంరాజుపై సిఎం ప్రశంసలు

డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతల స్వీకరణ

కాళ్ల : ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎంపికైన ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘు రామకృష్ణంరాజుపై సిఎం చంద్రబాబు ప్రశంసల వర్షం కురిపించారు. అంతర్జాతీయంగా ట్రిపుల్ ఆర్ చిత్రం సంచలనం సృష్టిస్తే, రఘురామకృష్ణంరాజు పొలిటికల్‌గా సంచలనం సృష్టించారన్నారు. రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా ఎంఎల్ఎ కనుమూరు రఘు రామకృష్ణంరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు స్పీకర్ సిహెచ్ అయ్యన్నపాత్రుడు గురువారం ప్రకటించారు. అనంతరం అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా ఆయన చేత స్పీకర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఆ తరువాత రఘురామకృష్ణంరాజును సభాపతి స్థానంలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, బిజెపి శాసనసభ పక్ష నేత విష్ణుకుమార్ రాజు తీసుకెళ్లి కూర్చోబెట్టారు. అనంతరం సిఎం అసెంబ్లీలో మాట్లాడారు. ట్రిపుల్ ఆర్‌పై నవ్వులు పూయించారు. కొత్త బాధ్యతల్లో రఘురామను చూసినప్పుడు చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం మంత్రులు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్, డిప్యూటీ స్పీకర్ ట్రిపుల్ ఆర్‌కు అభినందనలు తెలిపారు.

పుస్తక పఠనంతోనే విజ్ఞానం : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పుస్తకాలు, గ్రంథాలయాల అధ్యయనం ద్వారా ఎంతో విజ్ఞానం, మేధస్సు, వ్యక్తిత్వ వికాసం పొందుతారని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. పట్టణంలోని ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో గురువారం నెహ్రూ జయంతి సందర్భంగా బాలోత్సవం, 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను రిబ్బన్ కట్‌చేసి కలెక్టర్ ప్రారంభించారు. ముందుగా జవహర్ లాల్ నెహ్రూ, గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పుస్తక పఠనం, గ్రంథాలయాల్లో గ్రంథాలను అధ్యయనం చేయడం ద్వారా దేశంలో ఎందరో స్వాతంత్ర సమరయోధులు, సంఘసంస్కర్తలు, శాస్త్రజ్ఞులు మేధావులు, అధికారులు, ఉద్యోగులు అయ్యారన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఈ మేరకు విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. తాను చిన్నప్పుడు బిజినెస్ మెన్ అవుదామనుకున్నానని తెలిపారు. డిఎన్ఆర్ కళాశాల గతకాలపు లైబ్రరీయన్ అల్లూరి నరసింహరాజు, ఎస్ఆర్‌కెఆర్ కళాశాల ప్రొఫెసర్ ఎవిఎస్ఎన్ రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ఇన్‌ఛార్జి గ్రంథాలయ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. సంఘ సేవకుడు అల్లు శ్రీనివాస్, మానవతకు చెందిన గ్రంధి కుమార వెంకటేశ్వర ప్రసాద్ పాల్గొన్నారు

గ్రామాభివృద్ధి ప్రణాళికల పట్ల శ్రద్ధ వహించండి

డిఎల్‌డిఒ దోశరెడ్డి

ఆకివీడు : గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేసేందుకు ప్రతిఒక్కరూ పూర్తిస్థాయి లక్ష్యంతో శ్రద్ధ వహించాలని డిఎల్‌డిఒ వై.దోశ రెడ్డి సిబ్బందికి సూచించారు. గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక వాటిని సిద్ధం చేసే విధానం, అందుకు తగిన పద్ధతులు అనుసరించే రీతులు అంశాలపై సిబ్బందికి ఒకరోజు శిక్షణా కార్యక్రమం శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ విధానాల్లో ప్రదర్శన చూపిస్తూ లెక్కలు వేసే విధానం, సిబ్బంది ప్రణాళికను సిద్ధం చేసే విధానం టేబుల్స్ రూపంలో వారికి వివరించారు. పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, డ్వాక్రా విఎఎలు ఈ కార్యక్రమంలో శిక్షణ పొందారు.

చురుకైన న్యాయవాదిని కోల్పోవడం బాధాకరం


మొగల్తూరు : చురుకైన న్యాయవాదిని కోల్పోవడం బాధాకరమని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేష సాయి అన్నారు. మొగల్తూరులోని పాతకాలవ సెంట్రల్ ప్రాంతానికి చెందిన హైకోర్టు న్యాయవాది సంకు శ్రీనివాసరావు సంతాప సభను మొగల్తూరులోని ఆయన ఇంటి వద్ద గురువారం నిర్వహించారు. దీనికి హాజరైన పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ మొగల్తూరు నుంచి ఎవరు వెళ్లినా సరే బాగా ఆదరించే వారన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, నరసాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు చేగొండు బాలాజీ, మాజీ అధ్యక్షుడు చల్ల దానయ్య నాయుడు, గునిశెట్టి శ్రీనివాస్, నారిన శ్రీనివాస్, అంబటి సత్యనారాయణ, టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు ఉన్నారు.

ఎస్ఆర్‌కెఆర్ ఫిజిక్స్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్

భీమవరం టౌన్ : భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఇంజనీరింగ్ ఫిజిక్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న షేక్ రమీజా బేగం ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఫిజిక్స్‌లో పిహెచ్‌డి పొందారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు చెప్పారు. ఈ సందర్భంగా యాజమాన్యం తరపున కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ, నిషాంత వర్మ రమీజా బేగంను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమీజా బేగం మాట్లాడుతూ 'స్పెక్ట్రోస్కోపిక్ క్యారెక్టరైజేషన్, హెూమో-లూమో, ఎన్ఎల్ఒ అండ్ మాలిక్యులర్ డాకింగ్ ఎనాలసిస్ ఆఫ్ పర్టిక్యులర్ పోలియోటోమిక్ కాంపౌండ్స్ : ఏ స్టడీ బై డిఎఫ్‌టి' అనే అంశంపై ఆంధ్ర యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం హెడ్ ప్రొఫెసర్ వై.రామకృష్ణ మార్గదర్శకత్వంలో తాను చేసిన పరిశోధన గాను యూనివర్సిటీ డాక్టరేట్ ప్రధానం చేసిందన్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు మాట్లాడుతూ కరెంట్ అఫైర్స్‌పై డాక్టరేట్ చేయటం అభినందనీయమన్నారు. డాక్టరేట్ వచ్చిన తర్వాత తాను చేసిన పరిశోధనలు నిలుపుదల చేయకుండా తిరిగి కొనసాగించితేనే వాటి ఫలితాలు వాస్తవ రూపంలోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది డాక్టర్ షేక్ రమీజా బేగంను అభినందించారు.

మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

భీమవరం టౌన్ : చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లును ఇప్పటి వరకు అమలు చేయకపోవడం శోచనీయమని, మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుకు పార్లమెంటు సమావేశాల్లో చర్యలు తీసుకోవాలని ఎపి మహిళా సమాఖ్య జిల్లా కార్యవర్గ అధ్యక్షురాలు నెక్కంటి జగదాంబ, జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్ప కుమారి డిమాండ్ చేశారు. పార్లమెంటు ఆమోదించిన చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ల అమలుకు పార్లమెంటు సమావేశాల్లో చర్యలు చేపట్టాలని కోరుతూ భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) ఇచ్చిన దేశ వ్యాప్త పిలుపులో భాగంగా ఎపి మహిళా సమాఖ్య పశ్చిమ గోదావరి జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం భీమవరం కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ క్యాంపు కార్యాలయంలో ఎంపి కార్యాలయ ప్రతినిధి చెరుకూరి వెంకట కృష్ణంరాజుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్ట సభల్లో మహిళల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచడానికి, వారి హక్కులను పరిరక్షించడానికి చేసిన మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందినా అమలుకు పూనుకోకపోవడం, మహిళల సాధికారత పట్ల కేంద్ర ప్రభుత్వంకు వున్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం అవుతుందన్నారు. బిల్లు అమలుకు దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టడానికి వెనుకాడబోమని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు మరడాని లక్ష్మీ పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోళ్ళు ప్రారంభిస్తున్న వ్యవసాయాధికారి సంధ్య

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

ఉండి: మండలంలో గురువారం నుంచి అన్ని రైతు సేవా కేంద్రాలలో ఖరీఫ్ 2024కి సంబంధించిన ధాన్యం కొనుగోళ్ల ప్రారంభించినట్లు మండల వ్యవసాయ అధికారి బి.సంధ్య తెలిపారు. ఉండి మండలం చిలుకూరు గ్రామంలో ప్రారంభించిన ధాన్యం కొనుగోళ్ల కార్యక్రమంలో మండల తహశీల్దార్ పెండ్ర నాగార్జున, మండల వ్యవసాయాధికారి బి.సంధ్య, పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ మెరపుపూడి మహేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ 2024 సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించడం జరిగిందని, రైతులందరూ పంట కోత అయిన వెంటనే నాణ్యతా ప్రమాణాలు అనుసరించి తేమ శాతం 17 కంటే తక్కువ ఉన్న ధాన్యాన్ని పట్టుబడి పట్టించుకు రైతు సేవా కేంద్రం వద్ద సంచులు తీసుకోవాల్సిందిగా సూచించారు. భీమవరం డిసిఎంఎస్ సిబ్బంది, గ్రామపంచాయతీ కార్యదర్శి కొనకళ్ల రవికుమార్, గ్రామ రెవెన్యూ అధికారి విజయలక్ష్మి పాల్గొన్నారు.

రేపు బాక్సింగ్, థాంగ్ ట మార్షల్ ఆర్ట్ ఎంపికలు

వీరవాసరం : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్-14(బాలుర మాత్రమే), అండర్-17 బాల బాలికల బాక్సింగ్ జట్లు, అండర్-14, 17 బాల బాలికల థాంగ్ ట మార్షల్ ఆర్ట్ జట్ల ఎంపికలు ఈనెల 16న అత్తిలి మండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి పిఎస్ఎన్ మల్లేశ్వరరావు గురువారం తెలియజేశారు. ఈ ఎంపికలలో పాల్గొనే విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్‌తో ఉదయం 9 గంటలకు రిపోర్ట్ చేయాలని తెలిపారు. వివరాలకు సెల్ 70137 81688ను సంప్రదించాలని తెలియజేశారు.

సమ్మె బాటలో 108 ఉద్యోగులు

నరసాపురం: న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం 108 ఉద్యోగులు సమ్మెబాట పట్టనున్నారు. గురువారం తహశీల్దార్ టి.రాజారాజేశ్వరి, ఎంపిడిఒ జివిఎస్.రామకృష్ణరాజులకు సమ్మె నోటీసు అందించారు. ఈనెల 25 నుంచి ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించకుంటే సమ్మెకు దిగుతామని నోటీసులో పేర్కొన్నారు. జీతాలు నేరుగా ప్రతినెల 5వ తేదీ లోపు చెల్లించాలని, పనిభారం తగ్గించాలని, 108 సర్వీసును ప్రభుత్వమే నడపాలని, దీర్ఘకాలంగా పనిచేస్తున్న ఉద్యోగులకు భద్రత కల్పించాలని తదితర డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసు అందించారు. బి.రత్నసాగర్, కె.మహేశ్, రాజేష్, సంజుకుమార్ పాల్గొన్నారు.

ప్రజలు సంతృప్తి చెందేలా సేవలందించాలి

భీమవరం : మీ సేవ కేంద్రాల ద్వారా ప్రజలు సంతృప్తి చెందేలా సేవలందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సూచించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో జెసి జిల్లాలోని మీసేవా కేంద్రాల నిర్వాహకులు, ఆపరేటర్లతో సమావేశమై జిల్లాలో మీసేవా కేంద్రాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలు, కొన్ని మీసేవా కేంద్రాలపై అందుతున్న ఫిర్యాదులపై సమీక్షించారు. జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు, ఐడియం యం.కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

బెల్ట్ షాపు నిర్వాహకుని అరెస్ట్

తణుకు రూరల్ : తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బెల్ట్ షాపులపై గురువారం నిర్వహించిన దాడులలో మండలంలోని కోనాల గ్రామానికి చెందిన కోడమంచిలి దుర్గాప్రసాద్‌ని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 6 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులలో ఎస్ఐలు బి.లక్ష్మి, ఆర్.మధుబాబు, సిబ్బంది పాల్గొన్నారు. బెల్టుషాపులు నిర్వహిస్తే కఠినమైన చర్యలు తప్పవని తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ ఎస్.మణికంఠ రెడ్డి హెచ్చరించారు.

నేటి బాలలే రేపటి పౌరులు

ఘనంగా బాలల దినోత్సవం



భీమవరం టౌన్ : వివిధ రకాల వేషధారణలో విద్యార్థులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

విద్యార్థులు తల్లిదండ్రులు, గురువులు చెప్పే మంచి మాటలు విని విద్యలో బాగా రాణించాలని ఆదిత్య స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ కోరారు. స్థానిక అడ్డ వంతెన వద్ద ఉన్న ఆదిత్య ఇంగ్లీష్ మీడియం స్కూల్లో బుధవారం చిల్డ్రన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిల్డ్రన్స్ డే సందర్భంగా విద్యార్థులు సంస్కృతి సాంప్రదాయాలను వివరిస్తూ పలు రకాల దుస్తులను ధరించారు. విద్యార్థుల వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.యుగసుధ, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

భీమవరం బివి.రాజు పార్క్ కళావేదిక ప్రాంగణంలో బుధవారం మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతి, బాలల దినోత్సవాన్ని శ్రీవిద్య ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 18 మంది విద్యార్థులతో నిర్వహించారు. ఇంద్ర విజయం సాహిత్య రూపకం ప్రదర్శన నిర్వహించారు. పద్యం, గద్యం వచనలతో ఈ విద్యార్థులు సాహిత్య పరంగా అందరినీ ఆకట్టుకున్నారు. రూపకర్త తెలుగు పండితులు కలిగొట్ల గోపాల శర్మ మాట్లాడుతూ తెలుగు భాషను బాలబాలికలలో పెంపొందించాలని, తెలుగు పాఠ్య పుస్తకాలలోని అంశాలను రూపకల్పన చేసి విద్యార్థులతోనే సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రొఫెసర్ కె.రామారావు, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఎటువంటి మంచి విషయాలైన బాల్యం నుంచే విద్యార్థులకు తెలియజెప్పాలని అన్నారు. పేరిచర్ల లక్ష్మణ వర్మ, అరసవల్లి సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్ లక్ష్మీభవాని నెహ్రూ జీవిత చరిత్రపై వివరించారు.

నరసాపురం : పట్టణంలోని జై ఆర్క్ కిట్ ప్లే స్కూల్లో గురువారం చిల్డ్రన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బాలబాలికలకు ఫ్యాన్సీ డ్రెస్, ఆటల పోటీలు, డాన్స్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కొమ్మూరి వాణి మాట్లాడుతూ భారతదేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ పుట్టినరోజు సందర్భంగా బాలల దినోత్సవం చేసుకుంటామని, ఆయనకు పిల్లలంటే ఎనలేని ప్రేమాభిమానాలన్నారు. పిల్లలు వృద్ధిలోకి వచ్చి దేశం గర్వించే పౌరులుగా ఎదగటమే నెహ్రూకి నిజమైన నివాళి అన్నారు. అనంతరం పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు అందించారు.

గణపవరం : మండలంలోని సరిపల్లి-2 అంగన్వాడీ కేంద్రంలో గురువారం జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సూపర్ వైజర్ పి.తులసి మాట్లాడుతూ స్వాతంత్ర సాధనకు పోరాడిన వారిలో నెహ్రూ ఒకరని అన్నారు. నెహ్రూకి పిల్లలంటే అంటే ఇష్టమని, కాబట్టే నెహ్రూ పుట్టినరోజున బాలల దినోత్సవం జరుపుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన వారికి స్థానిక స్కూల్ టీచర్ దివ్య తేజ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్ వైజర్లు జి.చంద్రావతి, సిహెచ్.దుర్గాభవాని, అంగన్వాడీ కార్యకర్తలు ఝాన్సీ, నాగమణి, రాజేశ్వరి, వెంకటరమణ పాల్గొన్నారు.

పాలకొల్లు : దేశ తొలి ప్రధాని నెహ్రూ 135వ జయంతి పట్టణ కాంగ్రెస్ కార్యాలయం గాంధీ భవనంలో పట్టణ అధ్యక్షులు యడ్ల శివాజీ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి అనంతరం నరసాపురం, నిడదవోలు వద్ద ఉన్న జాతీయ నాయకుల విగ్రహాల వద్ద ఉన్న నెహ్రూ నిలువెత్తు విగ్రహానికి పూలదండలు వేసి నివాళు లర్పించారు. యడ్ల శివాజీ మాట్లాడుతూ నెహ్రూ పంచవర్ష ప్రణాళిక విధానాన్ని ప్రవేశపెట్టినందున దేశం ఎంతో అభివృద్ధి పథంలోకి వెళ్లిందన్నారు. ఈ కార్యక్రమంలో కొలుకులూరి అర్జున్ రావు, వర్ధనపు కాసు, రూంకాని శ్రీనివాస్, బోనం వెంకట్రావు, రొక్కాల బన్ని, పాల్ యలమర్తి మోహన్‌రావు, వై.నామగిరి, బొలిశెట్టి భాను ప్రకాష్‌లు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

పాలకొల్లు రూరల్: మండలంలోని దిగమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కోట శ్రీనివాస్ అధ్యక్షతన బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జవహర్ లాల్ నెహ్రూ జయంతిని బాలల దినోత్సవంగా జరుపుకోవడం ఆనందదాయకమని విద్యార్థులకు తెలియజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు నెహ్రూ చిత్రపటం వద్ద పుష్పాలను ఉంచి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకివీడు : బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులకు ఆటలు, పాటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్, అజమూరు గరువు ఎంపిపి పాఠశాల, విద్యా వికాస్ జూనియర్ కళాశాల విద్యాసంస్థల్లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, ఉపాధ్యాయులు సూచనలు చేశారు.

తణుకు : సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్‌చౌక్ వద్ద ఉన్న అంగన్వాడీ కేంద్రం ప్రాంగణంలో నెహ్రూ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాహితీ సామ్రాజ్యం అధ్యక్షులు తాడినాడ భాస్కరరావు మాట్లాడుతూ రాజకీయాల్లో ఒక శిఖరం, దేశ శాంతికపోతం జవహర్‌లాల్‌నెహ్రూ అని అన్నారు. అంగన్వాడీ కేంద్రం సహాయకురాలు మార్లపూడి దివ్య, చిప్పాడ లక్ష్మీ, చిన్నం సరితారాణి పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు అని, పిల్లలు చిన్నప్పటి నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చైర్మెన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా గురువారం మున్సిపల్ ప్రైమరీ స్కూల్ నెం.1లో మండల న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి సత్యవతి మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో చిన్న పిల్లలపై లైంగిక దాడులు ఎక్కువ అయ్యాయని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, ముప్పిడి సుబ్బయ్య, కత్తుల జస్పాల్ పాల్గొన్నారు.



నరసాపురంలో..

ఉండి : మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోనూ మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉండి మండలం పాందువ్వ మండల పరిషత్ స్పెషల్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి మాదాసి గోపి పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులందరూ నెహ్రూ ఆశయాలను కొనసాగించాలని సూచించారు. అంగన్వాడీ టీచర్ సత్యవేణి, ఆర్ఎంపి డాక్టర్ సోడదాసి రాంబాబు పాల్గొన్నారు.

మొగల్తూరు : మండలంలోని గ్రామాలలో పిల్లల దినోత్సవం గురువారం ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పిల్లల దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించారు.

తాడేపల్లిగూడెం : జాతీయ సేవా పథకంలో భాగంగా స్థానిక శశి ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థులకు క్రీడా పోటీలు, చిత్రలేఖనం, క్విజ్, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం కళాశాల యాజమాన్యం పాఠశాల విద్యార్థులకు భోజన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ యూనిట్ వారిని కళాశాల వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, సెక్రెటరీ మేకా క్రాంతి సుధ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మొహమ్మద్ ఇస్మాయిల్ అభినందించారు.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

ప్రజాశక్తి - పెనుమంట్ర



పెనుమంట్రలో..

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని, విద్యార్థులు నిత్యం గ్రంథ పఠనం ద్వారా విజ్ఞాన సముపార్జన చేసుకోవాలని మానవత మండల అధ్యక్షులు, మార్టేరు ఎస్‌విజి ఉన్నత పాఠశాల పీడీ కర్రి కృష్ణారెడ్డి అన్నారు. గురువారం స్థానిక శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. విశ్రాంత తహశీల్దార్ తామాడ సత్యనారాయణ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. గ్రంథాలయ అధికారి పిటి.శివకుమార్, స్థానిక ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉండి: గ్రంథాలయాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, అందులోని పుస్తకాలను పఠించడం వల్ల మేథోశక్తి పెరుగుతుందని యండగండి శాఖా గ్రంథాలయం అధ్యక్షులు చెరుకువాడ రవికుమార్ అన్నారు. గురువారం శాఖ గ్రంథాలయం ప్రారంభోత్సవ వేడుకలలో భాగంగా గ్రంథాలయ అధికారి ఎన్‌సిహెచ్.రామకృష్ణ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరు చిన్నతనం నుంచే గ్రంథాలయాలకు వెళ్లడం అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

నరసాపురం : ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ అంజయ్య జాతీయ పతాకావిష్కరణ చేశారు. అడిషనల్ ఎస్‌పి మురళీకృష్ణ పండిట్ జవహర్లాల్ నెహ్రూ జన్మదినం సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ బాలల దినోత్సవం సందర్భంగా పిల్లలకు శుభాకాంక్షలు తెలియజేసి పుస్తకాలను, మొక్కలను బహుమానాలుగా ఇవ్వడం అలవాటుగా చేసుకోవాలన్నారు. ఎంఇఒ పుష్పరాజ్యం మాట్లాడుతూ గ్రంథాలయాన్ని ఒకసారి దర్శించి గ్రంథాలయంలో ఏవిధమైన పుస్తకాలు ఉన్నాయో చూసి ఇష్టంగా చదవాలన్నారు. అనంతరం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ కెజెఎస్ఎల్.కుమారి పాల్గొన్నారు.

గణపవరం : పుస్తకపఠనం లేకపోతే పదసంపద ఉండదని, అందువల్ల ప్రతిఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని గణపవరం ఎంఇఒ పి.శేషు అన్నారు. పిప్పర గ్రంథాలయంలో ప్రారంభమైన జాతీయ 57వ గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సెల్‌ఫోన్‌ను అవసరం మేరకే ఉపయోగించుకోవాలన్నారు. దానికి బానిస అవ్వకూడదని తెలిపారు. మనకి సమగ్రమైన సమాచారం కోసం పుస్తకాల పఠనం తప్పనిసరి అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకులు పి.రంగారావు, స్థానిక హైస్కూల్ హెచ్ఎం ఎంజె వెంకటేశ్వరరావు, పిప్పర పంచాయతీ కార్యదర్శి ఎన్.నాగేంద్ర, జివి.కృష్ణారావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : గ్రంథాలయంలో అనేక పుస్తకాలు ఉంటాయనిచ ప్రతిఒక్కరూ గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలని తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ ఖతిబ్ కౌసర్ భావో తెలిపారు. గురువారం స్థానిక శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఆమె ప్రారంభించారు. గ్రంథాలయ శాఖ అధికారి వానపల్లి శ్రీనివాసరావు, గరికపాటి బాపయ్య శర్మ, వివిధ పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం అయ్యాయి. కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ టి.కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా గ్రంథాలయ పితామహులు ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఐక్యూఎసి కోఆర్డినేటర్ కె.భద్రాచలం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎం.రామకృష్ణ, డాక్టర్ వి.విజయలక్ష్మి, లాంగ్వేజ్ ఇన్‌ఛార్జి ఎన్‌విడి.దినకరన్, లైబ్రేరియన్ వి.రమేష్ పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి : జెసి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రోడ్లు గుంతలు పూడిక నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రహదారుల గుంతలు పూడిక పనులలో భాగంగా భీమవరం మండలం చిన అమిరం ఇండియన్ బ్యాంక్ వద్ద భీమవరం వయా కలిదిండి, గుడివాడ ప్రధాన రహదారిలో గుంతలు పూడిక పనులను బుధవారం జెసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలన్నారు. పనులలో ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా పూర్తి నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఉన్నారు.

గణిత దీప్తి మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలోని బ్రాడీపేట వద్దనున్న ఎవిఎస్ఎన్ మున్సిపల్ హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులకు గణిత దీప్తి స్టడీ మెటీరియల్‌ను శ్రీలావణ్య హాస్పిటల్ అధినేత డాక్టర్ స్వరూప్ గురువారం ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలతో పాటు దాతలు కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. మొదటగా విద్యార్థులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు చక్కగా పట్టుదలతో చదవాలని మంచి స్నేహితులను ఏర్పాటు చేసుకొని ప్రతి అపజయాన్ని ఒక విజయంగా మార్చుకోవాలని తద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈవిధంగా ప్రోత్సహించిన జివిఎస్‌విఆర్ మున్సిపల్ పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం ఆర్.భవానీ ప్రసాద్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా సహకార సంఘాల వారోత్సవాలు

ప్రజాశక్తి - కాళ్ల



కాళ్ల : జెండా ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ

మండలంలోని కాళ్లకూరు గ్రామంలో కాళ్లకూరు సహకార సంఘం ఆవరణలో గురువారం సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సబ్ డివిజనల్ కో ఆపరేటివ్ అధికారి జి.సత్యనారాయణ సహకార జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారోత్సవాలలో భాగంగా 14వ తేదీన సహకార శాఖ ద్వారా అమలు చేసే నూతన కార్యక్రమాల గురించి వివరించడం, 15వ తేదీన నూతన అవిష్కరణలు, సాంకేతికత సుపరిపాలన, 16వ తేదీన వ్యవస్థాపకత, ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర, 17వ తేదీన సహకార సంస్థల వ్యాపార ప్రాయోజిత సంస్థలుగా రూపాంతరం, 18వ తేదీన సహకార సంఘాల మధ్య సహకారాన్ని పెంపొందించడం, 19వ తేదీన మహిళలు, యువత, బలహీనవర్గాలకు సహకారంలో సహకార సంఘాల పాత్ర, 20వ తేదీన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో సహకార సంఘాల పాత్ర వంటి అంశాలపై అవగాహన కల్పించి, సహకార సంఘాల బలోపేతానికి కృషిచేయాలన్నారు. సొసైటీ సిఇఒ ఇబ్బా శ్రీనివాస్ మాట్లాడుతూ రైతుల కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది పి.రామకృష్ణంరాజు, వి.ప్రకాష్ వర్మ, వి.సత్యనారాయణరాజు, ఎస్.త్రిమూర్తులు, సిహెచ్‌వి.రామకృష్ణ, జి.అప్పారావు, సిహెచ్ ఎన్.ప్రసాద్, జె.లక్ష్మి, యు.శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

పాలకోడేరు : వందేళ్ల స్వాతంత్ర భారతదేశం 2047 సంవత్సరం నిర్దేశిత లక్ష్యంగా, వికసిత్ భారత్ భారత ప్రణాళికలో యువత, పేదలు, మహిళలు, అన్న దాతలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయని, ఆ లక్ష్యాలను చేరుకోవాలంటే సహకార సంఘాల తోడ్పాటు ఎంతో అవసరమని భీమవరం విభాగ సహకార అధికారి కె.వెంకటేశ్వర రావు అన్నారు. పాలకోడేరు సహకార సంఘం ఆవరణలో 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార పతాకాన్ని వెంకటేశ్వరరావు ఆవిష్కరించి మాట్లాడారు. వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాలు ముఖ్య పాత్ర పోషించాలన్నారు. పాలకోడేరు సహకార సంఘం ముఖ్య కార్య నిర్వహణాధికారి పివిఎల్ నరసింహారాజు, సహకార జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వేటుకూరి పద్మావతి మాట్లాడుతూ గ్రామస్థాయిలో రైతుల అభివృద్ధికి సహకార సంఘాల తోడ్పాటు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం సభ్యులు, సిబ్బంది జూనియర్ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



పాలకోడేరు : జెండా ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వరరావు

ఉండి: 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను ఉండి మండలం యండగండి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. యండగండి సహకార సంఘం కార్యదర్శి చెరుకువాడ రవికుమార్ మాట్లాడుతూ రైతు శ్రేయస్సే లక్ష్యంగా తమ సహకార సంఘం పనిచేస్తుందని అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా జిల్లాలోనే రైతులకు అత్యుత్తమ సేవలందిస్తూ ఉత్తమ అవార్డులు తీసుకున్నామన్నారు. తమ సహకార సంఘ పరిధిలోని రైతులకు కావలసిన రుణాలను అందిస్తూ సకాలంలో వసూలు చేస్తున్నామని తెలిపారు. రైతులు, సహకార సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణానికి చర్యలు

మొగల్తూరు : మండల కేంద్రం మొగల్తూరులో పక్క డ్రెయినేజీ నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఉపాధి హామీ చట్టం నిధుల నుంచి డ్రెయినేజీ నిర్మాణానికి డిపిఆర్ రూపొందిస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు డిఇ శ్రీనివాస్, ఎఇ మోహన్ రావులు గ్రామంలో పర్యటించారు. అనంతరం పంచాయతీ మ్యాప్‌ను పరిశీలించారు. వారి వెంట సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, ఉపసర్పంచి బోణం నరసింహారావు, తదితరులున్నారు.

అంతర్జాతీయ సదస్సుకు ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ విద్యార్థి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మూడవ సంవత్సరం ఎఐడిఎస్ చదువుతున్న విద్యార్థి శ్రీధర శ్యామ్ చంద్రా బోట్ల హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే అంతర్జాతీయ సదస్సుకు ఎంపికయ్యారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు అన్నారు. ఈమేరకు హార్వర్డ్ విశ్వవిద్యాలయంలోని హార్వర్డ్ కాలేజ్ ప్రాజెక్ట్ ఫర్ ఏషియన్ అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ విభాగం నుంచి విద్యార్థికి ఆహ్వానం అందినట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ అంతర్జాతీయ సదస్సుకు ఎంపికైన శ్రీధర శ్యామ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా శ్రీధర్ శ్యామ్ మాట్లాడుతూ హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో ఏషియన్ అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్(హెచ్‌పిఎఐఆర్) ఆధ్వర్యంలో జరిగే సదస్సులో తనకు పాల్గొనే అవకాశం కల్పించారని పేర్కొన్నారు. సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా చాలామంది పాల్గొంటున్నారు. సదస్సుకు కూడా అంతర్జాతీయ ప్రముఖులు హాజరవుతారని విద్యార్థి వెల్లడించారు.

వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలి

గణపవరం : గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాలను స్థానికులు వినియోగించుకోవాలని కాశీపాడు సొసైటీ అఫీషియల్ పర్సన్ ఇన్‌ఛార్జి కెవి.రామలక్ష్మి అన్నారు. గురువారం 71వ అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా జిల్లా పిఎంపి అసోషియన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిరంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి రామలక్ష్మి అధ్యక్షత వహించారు. శిబిరంలో ఏలూరు ఆశ్రమం హాస్పిటల్ వైద్యులు వైద్యసేవలు అందించారు. 150 మందికి షుగర్, బిపి, కంటి పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో తాడేపల్లిగూడెం బజారు మేనేజర్ బి.సత్యనారాయణ, సూపర్ వైజర్ కె.వెంకటేష్, ఐవి రామకృష్ణంరాజు, జిల్లా కార్యదర్శి శుభాన్ పాల్గొన్నారు.

85 మందికి వైద్య పరీక్షలు

తణుకు : ప్రపంచ మధుమేహ వ్యాధి దినోత్సవం సందర్భంగా తణుకు రోటరీ క్లబ్ వారు గురువారం సజ్జాపురం వేవుళ్లమ్మ గుడి వద్ద ఉదయం నుంచి ఉచిత బిపి, మధుమేహ, ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 85 మందిని పరీక్షించారు. సంస్థ కార్యదర్శి కతారి సిద్ధార్థ, వంగూరి హనుమంతరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

పాలకోడేరు : గొరగనమూడి స్వామి జ్ఞానానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం విద్యాసామాగ్రిని పంపిణీ చేశారు. కీర్తిశేషులు కలిదిండి లక్ష్మీనరసిహారాజు జ్ఞాపకార్థం వారి కుమారులు కలిదిండి సత్యనారాయణ రాజు వర్మ, కుమార్తెలు సుమాని, తనుజ సహకారంతో సుమారు 280 మంది విద్యార్థులకు ఫ్యాడ్స్, పెన్నుల కిట్లు, జామెంటరీ బాక్స్‌లు రూ.200 విలువ గల విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. విద్యాకమిటీ చైర్మన్ పొన్నమండ బాలకృష్ణ, ఎంపిటిసి కృష్ణకుమారి పాల్గొన్నారు.

బొండాడలో కార్తీక వన సమారాధన

కాళ్ల : మండలంలోని బొండాడ గ్రామంలో వేంచేసియున్న శ్రీభోగేశ్వర జనార్ధన స్వామి వార్ల దేవాలయంలో కార్తీక మాసం సందర్భంగా సామూహిక కుంకుమ పూజలు గురువారం నిర్వహించారు. బొండాడ గ్రామానికి చెందిన మందపాటి రామారావు-సావిత్రిల జ్ఞాపకార్థంగా వారి కుమారులు మందపాటి విశ్వేశ్వరరావు, కోటేశ్వరరావు(లేటు), వెంకన్న వారి సహకారంతో మందపాటి కృష్ణమూర్తి-పావని మాత ఆధ్వర్యంలో భోగేశ్వర జనార్ధన స్వామి ఆలయంలో కార్తీక వన సమారాధన నిర్వహించారు.